

విద్యుత్ చార్జీల పెంపుపై లాంతర్లతో వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నాయకులు



పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న కాసు మహేష్‌రెడ్డి, నాయకులు

ప్రజా కంటక పాలనను అంతమొందిస్తాం

- ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాం
- విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై రూ.16వేల కోట్ల భారం
- సామాన్యుడి నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- విజయవంతమైన విద్యుత్ చార్జీల పెంపుపై 'పోరు బాట'

గురజాల: రాష్ట్రంలో జరుగుతున్న ప్రజా కంటక పాలనను అంతమొదించే వరకు పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కరెంటు చార్జీల బాదుడుపై పోరు బాట నిరసన కార్యక్రమ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. విద్యుత్ చార్జీల బాదుడుపై వినూత్నంగా నిరసన చేపట్టారు. లాంతర్లు చేతబూని నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ నినాదాలతో ర్యాలీ హోరెత్తింది. అనంతరం విద్యుత్ శాఖ ఏడీఈ ఎం.శ్రీనివాసరావుకు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, వైద్యుడు చింతలపూడి అశోక్‌కుమార్, దేవళ్ల రేవతి, పోలు వీరారెడ్డి, కర్రా చిన కోటేశ్వరరావు, కె.గిరి, జూలకంటి శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ వీరభద్రుని రామిరెడ్డి, మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, డీజే నారాయణ, మహంకాళీ యశోద దుర్గా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా ఉంటాం



ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజలకు అండగా ఉంటాం. విద్యుత్ చార్జీల పెంపు సామాన్యుడికి భారంగా మారింది. అద్దె ఇళ్లలో ఉండే వారికి అద్దె కన్నా.. కరెంటు చార్జీలు అధికంగా వస్తున్నాయి. సంక్షేమ పథకాల అమలును కూటమి ప్రభుత్వం విస్మరించింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుకుని ప్రజలు, మహిళలు చిరునవ్వులతో పండుగలు చేసుకున్నారు. ఆ పరిస్థితి నేడు వారిలో లేదు. 2047 విజన్ అంటూ సీఎం చంద్రబాబు నాయుడు మాయ మాటలు చెప్పారు. కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత రోజురోజుకు పెరుగుతోంది. విద్యుత్ చార్జీల బాదుడు ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. సుమారు రూ.16 వేల కోట్లు ప్రజలపై అదనంగా భారం పడింది. ప్రజల పక్షాన నిలబడే పార్టీ వైఎస్సార్ సీపీ. గతంలో రైతుల పక్షాన, ఇప్పుడు ప్రజల పక్షాన విద్యార్థుల తరుపున పోరాటం చేస్తూ ముందుకు సాగుతున్నాం.

– కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గురజాల



విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుబాట కార్యక్రమానికి భారీగా తరలి వస్తున్న పార్టీ శ్రేణులతో పీఆర్కే



విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా ఈఈ సింగయ్యకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పీఆర్కే

ప్రజలపై కరెంట్ చార్జీల బాదుడు

- హామీలు విస్మరిస్తూ ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం
- విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై భారం
- ప్రజా వ్యతిరేఖ విధానాలపై పోరాడాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి
- విజయవంతమైన వైఎస్సార్ సీపీ ప్రజా పోరుబాట
- విద్యుత్ కార్యాలయం ఎదుట నిరసన

మాచర్ల: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపై విపరీతమైన భారం మోపుతూ, హామీలు విస్మరిస్తూ..మోసం చేస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు శుక్రవారం విద్యుత్ చార్జీల పెంపునకు నిరసనగా.. పార్టీ కార్యాలయం నుంచి మాచర్ల డివిజనల్ విద్యుత్ శాఖ కార్యాలయం వరకు పోరు బాట భారీ ర్యాలీ నిర్వహించారు. మాచర్ల పట్టణం, రూరల్, రెంటచింతల, వెల్దుర్తి, దుర్గి, కారంపూడి మండలాల నుంచి వందలాది మంది తరలి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. 'దోపిడి రాజ్యం, దొంగల పాలన, ప్రజలపై భారం మోపే ప్రభుత్వం మనకు అవసరమా' అంటూ నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఈఈ(ఆపరేషన్) నూతలపాటి సింగయ్యకు పార్టీ నాయకులతో కలిసి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వినతి పత్రం అందజేశారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ తాడివెంకటేశ్వర రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నవ్వులూరి భాస్కరరెడ్డి, మాజీ వ్యవసాయ శాఖ అడ్వైజర్ కమిటీ సభ్యుడు మేకల కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ బూరే శ్రీనివాస్, ఎంపీపీ కోటిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలను మోసగిస్తూ 'కూటమి' పాలన



ప్రజలందరూ ఆశతో ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే వారిని మోసగించే పరిస్థితిలో కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతోంది. విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన సీఎం చంద్రబాబు నాయుడు ఆర్టీసీ, విద్యుత్ చార్జీలతో పాటు అనేక పన్నులు విధించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రజలపై భారం మోపుతూ స్పంద సృష్టి పేరుతో ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఆసన్నమైంది. అందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు సిద్ధం కావాలి. రాష్ట్రంలో అక్రమ కేసులతో సోషల్ మీడియా యాక్టివిస్టులను బెదిరిస్తూ, వైఎస్సార్‌సీపీ నాయకులను ఇబ్బందులకు గురి చూస్తూ కూటమి ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తోంది. ఏ ఒక్క కార్యకర్త, నాయకులు, ప్రజలు భయపడాల్సిన అవసరం లేదు. మళ్లీ మంచి రోజులు వస్తాయి.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పల్నాడు

క్లుప్తంగా

పౌష్టికాహార కిట్లు పంపిణీ

దాచేపల్లి : ఎయిడ్స్ బాధితుల పట్ల ప్రేమ అప్యాయతలు చూపాలని పీహెచ్‌సీ వైద్యురాలు ఇమ్మడిశెట్టి అమూల్య అన్నారు. ఫ్రెండ్స్ ట్రూ సర్వీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ తంగెళ్ల శ్రీనివాసరావు సహకారంతో 50 మంది ఎయిడ్స్ బాధితులకు పౌష్టికాహారం కిట్లను డాక్టర్ అమూల్య చేతుల మీదుగా స్థానిక పీహెచ్‌సీ వద్ద శుక్రవారం అందజేశారు. డాక్టర్ అమూల్య మాట్లాడుతూ..ఎయిడ్స్ వ్యాధిబారిన పడిన బాధితులు అధైర్య పడకుండా మనోధైర్యంతో ముందుకెళ్లాలన్నారు. సమాజంలో అన్ని రకాలు గౌరవ మర్యాదలు ఉంటాయని చెప్పారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ..తమ ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవకార్యక్రమాలు చేపట్టి అండగా నిలిచామన్నారు. రీడ్స్ సంస్థ ప్రతినిధులు మహ్మద్‌గౌస్, కొమలి, వినుకొండ సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



దాచేపల్లి: స్థానిక ఆదర్శ పాఠశాల, గామాలపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు సంస్థ ద్వారా స్టడీ మెటీరియల్ రూపొందించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు తగరం ఆనంద్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉత్తీర్ణత సాధించాలని ఆనంద్‌కుమార్ కోరారు. ప్రిన్సిపల్ రవికుమార్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వట్టిపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 15 అర్జీలు



దాచేపల్లి : మండలంలోని ముత్యాలంపాడులో రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. తహసీల్దార్ వైవీ కుటుంబరావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో భూ సమస్యలపై రైతులు 15 అర్జీలను అందజేశారు. అడంగళ్‌లో పోలం వివరాలు నమోదు, పొలం గట్ల వివాదాలపై అర్జీలు అందాయని, వీటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు. జెడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి, మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొట్టిముక్కల పెద హనిమిరెడ్డి, సర్పంచ్ నెమలికొండ వెంకటచారి, ఎంపీటీసీ వెంకటనాగయ్య, సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రైండర్ బహూకరణ

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో గల కస్తూర్బా గాంధీ బాలికల వసతి గృహానికి తెలుగుదేశం నాయకుడు వడ్లమూడి వెంకట కిషోర్ రూ.20 వేల రూపాయల విలువ చేసే గ్రైండర్‌ను శుక్రవారం బహుకరించారు. నాణ్యమైన భోజనం అందించేందుకు గ్రైండర్ ఉపకరిస్తుందని బహుకరించినట్లు ఆయన తెలిపారు. కిషోర్‌కు పాఠశాల ప్రిన్సిపల్ బాలశౌరీలు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

రూ.4,546.84 లక్షల రాబడి అంచనా

- పిడుగురాళ్ల మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశం
- సమస్యలను వెల్లువెత్తిన కౌన్సిలర్లు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపాలిటీ 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ. 4546.84 లక్షలు రాబడి అంచనాలను మున్సిపల్ అధికారులు సిద్ధం చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం బడ్జెట్ అంచనా సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,367.30 లక్షల ప్రారంభ నిల్వతో రూ.2,229.12 లక్షల రాబడి వచ్చింది. ఇందులో రూ.2,465.78 లక్షలు ఖర్చు అయిందని, రూ.1,130.34 లక్షలు మిగిలిన బడ్జెట్‌గా అధికారులు చూపించారు. దీనిని కొనసాగిస్తూ వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.1,130.34 లక్షలు ప్రారంభ నిల్వగా తీసుకొని రూ. 3,416.50 రాబడిగా అంచనా వేశారు. రూ.1130.34 లక్షల మిగులు కలిపి రూ.4,546.84 లక్షలు రాబడిగా అంచనా వేశారు. ఇందులో రూ.4,196.15 లక్షలు ఖర్చు కాగాలదని చెబుతున్నారు. ఖర్చు పోను రూ.350.69 లక్షలు ముగింపు నిల్వతో ఈ ఆర్థిక బడ్జెట్ అంచనాలను మున్సిపల్ అధికారులు సిద్ధం చేశారు. బడ్జెట్ అంశాలను జూనియర్ అకౌంట్ ఆఫీసర్(జేఏవో) వనిత చదివి వినిపించారు. మున్సిపల్ కౌన్సిలర్లు కత్తెరపు వాసుదేవరెడ్డి, గుర్రం అప్పిరెడ్డి, మాదాల కిరణ్‌కుమార్, కొక్కెర శ్రీను, పసుపులేటి ఆనంద్, అన్నెం పద్మావతితోపాటు పలువురు కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి పలు సమస్యలు తీసుకొచ్చారు. మస్యలన్నిటిని పరిష్కరించే దిశగా అధికారులు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తున్న అధికారులు

పీఆర్కే..పోటెత్తిన ప్రజాభిమానం

మాచర్ల రూరల్: వైఎస్సార్‌సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై ప్రజాభిమానం ఇసుమంత కూడా తగ్గలేదు. విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరు బాట కార్యక్రమంలో పాల్గొనేందుకు నియోజకవర్గానికి పీఆర్కేకు వచ్చారు. అశేష ప్రజానీకం ఆయన ఘన స్వాగతం పలికింది. ప్రతి ఒక్కరినీ పేరుపేరున పలకరిస్తూ యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న పీఆర్కే. టీడీపీ నాయకుల అక్రమ కేసులు, పోలీసుల నిర్బంధాలను లెక్కచేయకుండా వేలాది మంది కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలివచ్చి జైకొట్టారు.



పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఘన స్వాగతం పలికి వైఎస్సార్ సీపీ శ్రేణులు

మహోన్నతమైన వ్యక్తి మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

గురజాల రూరల్ : భారతదేశ రూపు రేఖలు మార్చిన మహోన్నతమైన వ్యక్తి మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ అని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం బాధాకరమన్నారు. ఆయన పలు ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి దేశం రూపురేఖలు మార్చారన్నారు. చేసింది చెప్పుకునే వ్యక్తి కాదని పనులు చేసి చూపించే వ్యక్తి మన్మోహన్ సింగ్ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), మండల కన్వీనర్ గాంధీ, పట్టణ కన్వీనర్ కె.అన్నారావు, కె.చిన కోటేశ్వరరావు, కె.గిరి, మహంకాళీ యశోద దుర్గా, డీజే నారాయణ, పీర్ అహ్మద్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికా విద్య ద్వారానే ఆర్థికాభివృద్ధి

మాచర్ల రూరల్: బాల్య వివాహాలను అరికట్టి బాలబాలికల విద్య, ఉద్యోగ అవకాశాలకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్‌ఎం బీవీ నాగమణి కోరారు. శుక్రవారం మండలంలోని కొప్పునూరు గ్రామ జెడ్పీహెచ్ పాఠశాలలో కిశోర్ బాలబాలికల అవగాహన సదస్సు ఆమె ప్రారంభించి, మాట్లాడారు. విద్య ద్వారానే ఆర్థికాభివృద్ధి, అసమానతలు పారద్రోలవచ్చునని ప్రతి బాలికకు ఉన్నత విద్యనందించి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆమె కోరారు. 18 ఏళ్లు నిండే వరకు బాలికలకు, 21 సంవత్సరాలకు బాలురుకు నిండిన తరువాతే వివాహం చేయాలని కోరారు. బాల్య వివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్లు డీవీఎస్ సుబ్బాచారి, పద్మావతి, చంద్రకళ, అంగన్‌వాడీ ఉద్యోగులు గోవిందమ్మ, జ్యోతి, రంగమ్మ, మరియమ్మ, ఉపాధ్యాయులు పాల్ రాజు, శ్రీనివాసరావు, నారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

రెంటచింతల: ధనుర్మాసం సందర్భంగా రెంటచింతలలోని రుక్మిణి సత్యభామ సమేత వేణు గోపాల స్వామి ఆలయం, రెంటాల శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయం, తుమ్మకోట జనార్ధనస్వామి ఆలయాల్లో శుక్రవారం వేకువ జాము నుంచి భక్తి శ్రద్ధలతో ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో గోవింద నామస్మరణ మార్మోగింది. స్వామివార్లు ప్రత్యేక అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు.



రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి

చేతి వృత్తులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

పిడుగురాళ్ల: చేతి వృత్తుల వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ శుక్రవారం తన కార్యాలయంలో తెలిపారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, మెప్మా పిడుగురాళ్ల సంఘం పరిధిలోని ప్లంబర్స్, కార్పెంటర్లు, ఎలక్ట్రీషన్లు, ఏసీ, గీజర్, టీవీ మెకానిక్‌లతో పాటు బ్యూటీషన్ పలు సేవలు అందించే వారందరికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఎన్ఎస్‌డీసీ ద్వారా అందించి సర్టిఫికెట్లు, హోం ట్రైయాంగిల్ ప్లాట్‌ఫాం ద్వారా జీవనోపాధి కల్పించబడుతుందని తెలిపారు. ఆసక్తి గలిగిన అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోపు పట్టణంలోని గాంధీ నగర్ సచివాలయం సమీపంలో ఉన్న మెప్మా కార్యాలయంలో వివరాలను నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు. రేషన్, ఆధార్, బ్యాంక్ పాస్ పుస్తకం, పాన్ కార్డు జిరాక్స్‌లతో హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 83098 36728, 98481 08768 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



దాచేపల్లి : నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు శుక్రవారం గాయపడ్డారు. వాడపల్లికి చెందిన హరిగోపాల్‌తో పాటుగా మరొక వ్యక్తి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఎదురుగా వస్తున్న వాహనం అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో హరిగోపాల్‌తో పాటుగా మరొకరు గాయపడారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దరఖాస్తు చేసుకోండి

దాచేపల్లి : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో వివిధ రకాల సేవలు అందించేందుకు ఉచిత శిక్షణ కోసం ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ ఏవీ అప్పారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్లంబర్లు, కార్పెంటర్లు, ఎలక్ట్రిషియన్లు, ఏపీ, గీజర్, టీవీ, ఫ్రిజ్, వాషింగ్‌మెషీన్ రిపేర్లు, బ్యూటీషన్‌పై శిక్షణ కార్యక్రమం ఉచితంగా ఇస్తుందని, ఆసక్తి ఉన్న వారు నడికుడి–1 సచివాలయం ఈ నెల 30వ తేదీలోపు నమోదు చేసుకోవాలని, పూర్తి వివరాలకు 8179216310 నంబరుకు సంప్రదించాలన్నారు.

ఏపీఎంకు కోర్టు ఉత్తర్వులు అందజేత

దాచేపల్లి : డ్వాక్రాలో తొలగించిన యానిమేటర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కోర్టు ఉత్తర్వుల కాపీని తొలగించిన యానిమేటర్లు ఏపీఎం రవిని కలిసి శుక్రవారం అందజేశారు. పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని ఏపీఎం చెప్పారు. అనంతరం యానిమేటర్లు మాట్లాడుతూ..తమను అన్యాయంగా విధులు నుంచి తొలగించారని, తమకు జరిగిన అన్యాయంపై హైకోర్టుని ఆశ్రయిస్తే తిరిగి తమను విధుల్లోకి తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. సంబంధిత అధికారులకు హైకోర్టు ఉత్తర్వుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తక్షణమే తమను విధుల్లోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఏపీఎంని కలిసిన వారిలో యానిమేటర్లు సుమతీ, అచ్చయ్య, శైలజ, అనంతలక్ష్మీ, వరలక్ష్మీ, మేరి, మరియమ్మ, దానమ్మ, నాగలక్ష్మీ, హైమవతి, లూకయ్య, మల్లీశ్వరి తదితరులున్నారు.



ఏపీఎం రవికి కోర్టు ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న యానిమేటర్లు

సత్రశాల దేవస్థానం ఆదాయం రూ.70 వేలు

సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద నున్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఈ ఏడాది కార్తీక మాసం సందర్భంగా హుండీ రాబడి రూ.70,382 వచ్చినట్లు దేవదాయ శాఖ సత్తెనపల్లి ఇన్‌స్పెక్టర్ వి. లీలావతి తెలిపారు. శుక్రవారం దేవస్థానం నందు సిబ్బందితో కలిసి హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు ఆమె వెల్లడించారు. 2023లో రూ.73,956లు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈఓ గాదె రామిరెడ్డి, దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్టేల మల్లికార్జున శర్మ, సభ్యులు గుండా శివయ్య, నీలం మల్లయ్య, గొట్టం శ్రీనివాసరెడ్డి, మున్నా లింగయ్య, మున్నా ప్రభురాజు పాల్గొన్నారు.



హుండీ కానుకలను లెక్కిస్తున్న అధికారులు

అనుమతులు లేని వెంచర్లను తొలగిస్తాం

రాజుపాలెం: అనుమతులు లేకుండా వెంచర్‌లు ఏర్పాటు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ దుర్గేష్‌రావు తెలిపారు. మండలంలోని అనుపాలెం, చౌటపాపాయపాలెం పంచాయతీల పరిధిలో అనుమతులు లేకుండా అక్రమంగా లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్న భూమిని తహసీల్దారు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ భూమిని వెంచర్‌లుగా ఏర్పాటు చేయదలచినవారు ముందుగా రెవెన్యూ అనుమతులు తీసుకోవాలని, తరువాత పంచాయతీ అనుమతులు పొందిన తరువాతనే ప్లాట్స్ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ప్లాట్స్ కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాలని సూచించారు. విచారణ చేసి అనుమతులు లేని వెంచర్లను వెంటనే తొలగిస్తామని భూ యజమానులను హెచ్చరించారు. అక్కడ ప్లాట్లు కొన్న యజమానులకు ఇంటి నిర్మాణం కోసం పంచాయతీ అనుమతి ఇవ్వదని, అనుమతులు లేకుండా ప్లాట్లను రిజిస్ట్రేషన్ కూడా చేయరని చెప్పారు.



అక్రమ వెంచర్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఘనంగా సీపీఐ శత వసంతాల వేడుకలు

రొంపిచర్ల: స్థానిక చెరువుకట్ట సెంటర్లో శుక్రవారం సీపీఐ శతవసంతాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జెండాను ఎగురవేశారు. సీపీఐ జిందాబాద్, మార్క్సిజం–లెనినిజం జిందాబాద్ అంటూ సీపీఐ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఈ దేశంలోభారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 99 సంవత్సరములు పూర్తి చేసుకుని 100 సంవత్సరములో అడుగుపెడుతుందని అన్నారు. అనంతరం మండలంలో విప్పర్లపల్లి గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు కొర్నెపాటి ఏసోబును ఘనంగా సన్మానించారు. సీపీఐ ఏరియా సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, రైతు సంఘం నాయకులు చిట్యాల శ్రీనివాసరెడ్డి, సీపీఐ మండల నాయకులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే సీపీఐ లక్ష్యం

మంచికల్లు(రెంటచింతల): పేద ప్రజల సంక్షేమమే సీపీఐ పార్టీ లక్ష్యమని సీపీఐ మండల కార్యదర్శి కేతావత్ రంగ నాయకులు అన్నారు. మండలంలోని మంచికల్లు గ్రామంలో శుక్రవారం సీపీఐ పార్టీ స్వర్ణోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పార్టీ జండాను ఆవిష్కరించి మాట్లాడారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ)1925 డిశంబర్ 26న దేశంలో కమ్యూనిజం భావజాలంతో తొలి రాజకీయపార్టీగా స్థాపించబడిందన్నారు. ఈ కార్యక్రమంలో మంచికల్లు శాఖ కార్యదర్శి ఏలూరి నాగార్జున, పార్టీ నాయకలు చేవూరి శ్రీనివాసరావు, కంభంపల్లి శంకర్‌రావు, చేవూరి కోటేశ్వరరావు, తుమ్మా సంజీవరావు, కన్నెబోయిన నందీశ్వరరావు, షేక్ వలి, కన్నెబోయిన తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



మంచికల్లులో జెండా ఆవిష్కరిస్తున్న కార్యదర్శి రంగనాయకులు